# Kaloji Narayana Rao Memorial Lecture 2025



# తెలంగాణా విమోచనోద్యమం కాళోజీ కవిత్వం


ప్రొ॥ ఎస్వీ సత్యనారాయణ

మాజీ ఉపకులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్.



Organised by

**Dr.B.R. Ambedkar Open University,**

Prof.G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

# About Dr. BRAOU

The University, initially known as Andhra Pradesh Open University, was set up on 26th August 1982 through an Act of the A.P.State Legislature (APOU Act 1982). Subsequently the University was renamed as Dr.B.R.Ambedkar Open University on 26th October,1991. The establishment of this University, the first of its kind in India, heralded and era of affirmative action on the part of the Government to provide opportunities of higher education to all sections of society to meet the changing individual and social needs. The University is providing services to the student community through a wide network of 104 study centres spread across the Telangana state including 10 Regional Co-ordination centres and 6 centres exclusively meant for women students. Prison inmates under life sentence also enrol themselves as students and pursue education through exclusive study centres at Central Prison - Cherlapally, Warangal an exclusive Study Centre for Army Personal and their family members, which was located at AOC, Secunderabad. The University offers UG, PG Degree, Certificates, Diploma and Ph.D. programmes including various Professional Programmes.

# కాళోజీ స్మారకోపన్యాసం
# 2025

# తెలంగాణా విమోచనోద్యమం
# కాళోజీ కవిత్వం

ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

**Dr. B.R. Ambedkar Open University**

Prof. G. Ram Reddy Marg, Road No. 46,
Jubilee Hills, Hyderabad (TS) 500 033.

# తెలంగాణా విమోచనోద్యమం కాళోజీ కవిత్వం

- ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

**జీ**వితం చైతన్యాన్ని నిర్ణయిస్తుంది. సామాజిక జీవితం సామాజిక చైతన్యాన్ని నిర్దేశిస్తుంది. కాళోజీ నారాయణరావు వంటి ప్రజాకవులు రూపొందడానికి దక్కన్ పీఠభూమిగా భావింపబడిన హైదరాబాద్ సంస్థానం. ఇక్కడి సామాజిక స్థితిగతులు, భూస్వామ్య వ్యవస్థ, సాంస్కృతిక వాతావరణం, ఆంధ్రోద్యమం, ప్రజాచైతన్య పోరాటాలు మొదలైన అంశాలకు చెందిన నిర్దిష్టమైన నేపథ్యం ఉంది. వాటిని పరిశీలిద్దాం.

బ్రిటిష్‌వారు మనదేశాన్ని జయించి, వలస పాలనను సుస్థిరం చేసుకున్న తర్వాత దేశంలోని మూడింట రెండు భాగాలను తమ ప్రత్యక్ష పాలనలో పెట్టుకుని, మిగతా మూడో వంతు భాగాన్ని రాజుల, సంస్థానాధీశుల పాలనలో కొనసాగనిచ్చారు. బ్రిటిష్వారు తలుచుకుంటే సంస్థానాధీశులను తుడిచిపెట్టి, ఈ భూభాగాన్నంతటినీ బ్రిటిష్ ఇండియాలో కలుపుకోగలిగేవారు. కానీ ప్రజలను ప్రత్యక్షంగా దోచుకోడానికి బదులు స్వదేశీ సంస్థానాలను కొనసాగనిచ్చి వారి ద్వారా ప్రజలను కొల్లగొట్టించి లాభాలను గడించాలనే ఉద్దేశ్యంతో ఈ సంస్థానాలను అంగీకరించారు. వాటిలో హైదరాబాద్ సంస్థానంలో భాష రీత్యా మూడు ప్రాంతాలుండేవి. i. తెలంగాణము, ii. మరాట్వాడా, iii. కర్ణాటక ప్రాంతం. అన్నింటికన్నా పెద్దది తెలుగువారు నివసించే తెలంగాణా. దీనిలో 8 జిల్లాలుండేవి. 1. అత్రాఫ్ బల్దా, 2. నిజామాబాద్, 3 మెదక్ 4. మహబూబ్ నగర్, 5. నల్లగొండ, 6. వరంగల్లు, 7 కరీంనగర్, 8. ఆదిలాబాద్, సంస్థానంలోని జిల్లాలను 4 సుబాలుగా విభజించారు. అందులో తెలుగు మాట్లాడేవారు ఎక్కువగా ఉన్న సుబాలు రెండు 1. మెదక్ సుబా, 2, వరంగల్లు సుబా, ఈ సుబాలకు అధిపతులు సుబేదార్లు (గవర్నర్లు). వీరికి రెవెన్యూ అధికారాలుండేవి. జిల్లాలకు అధిపతులు తాలూక్దారులు. వీరికి రెవెన్యూతో పాటు పరిపాలనాధికారాలు కూడా ఉండేవి. తాలూకాలకు తహసీల్దార్లు అధికారులుగా ఉండేవారు. సంస్థానంలో మూడింట రెండు వంతులు మాత్రమే సంస్థానాధిపతి ప్రత్యక్ష పాలన కింద ఉండేది. దీనినే 'ఖాల్సా' లేదా 'దివానీ' అనేవారు. మిగిలిన మూడో వంతు ప్రాంతంలో జాగీర్లుండేవి. ఈ జాగీర్లు 4 రకాలు. 1.

సర్ఫెఖాస్ నిజాం ప్రభువు స్వంత జాగీరు, 2. పాయెగాలు (నిజాం రాజబంధువుల జాగీర్లు), 3. ముస్తసనా జాగీర్లు, 4. సాధారణ జాగీర్లు. ఈ జాగీర్లకు అధిపతులు జాగీర్దార్లు, అలాగే 'మక్తా' అనే ప్రాంతాలుండేవి. వీటి అధిపతులు మఖ్తాదారులు, తెలంగాణాలోని సుమారు 10 వేల గ్రామాల్లో 2600 జాగీరు గ్రామాలుండేవి.

## భూస్వామ్య వ్యవస్థ

గ్రామాలపైన, అక్కడి భూములపైన అన్ని అధికారాలు జాగీర్దార్లు, మఖ్తాదార్లు, దేశముఖులు, దేశపాండ్యాలు, పటేలు, పట్వారీలు వంటి భూస్వామ్య వర్గాలు వివిధ స్థాయిల్లో, వివిధ హోదాలతో గ్రామ ప్రజల నుండి పెద్ద మొత్తంలో పన్నులు వసూలు చేసేవారు. రైతుల నుండి ధాన్యం, చేతివృత్తుల వారి నుండి పరిహారం తీసుకొనేవారు. క్రమంగా వీరిలో కొందరు ప్రజలను పీడించడం మొదలు పెట్టారు.

వీరు గ్రామ పరిపాలననంతటినీ సాగిస్తూ వుండేవారు. వీరు సాగించే దౌర్జన్యాలకు కూడా అంతులేకుండా వారి వారి హోదాలను బట్టి, కొందరికి న్యాయ విచారణ తీర్పుల పేరుతో మరణశిక్షలు కూడా విధించడానికి అధికారాలుండేవి. చాలా వరకు గ్రామాల్లో దేశముఖ్‌లు, పటేల్– పట్వారీలు ప్రజల్ని దోచుకొనే ప్రభుత్వ అధికారులుగా తయారయ్యారు.

## సామాజిక స్థితిగతులు

భూస్వామ్య వర్గాలు తప్ప సామాన్య ప్రజానీకం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికే దుర్భర సామాజిక పరిస్థితులు సంస్థానంలో విలయ తాండవం చేసేవి.

దొరల ఇండ్లలో క్రింది తరగతికి చెందిన స్త్రీ పురుషులంతా వెట్టిచాకిరీ చేయవలసిన వచ్చేది. ఆ రోజుల్లో వెట్టిని తప్పించుకోవడం ఎవరి వల్లా అయ్యేది కాదు. వెట్టి చేయని ప్రతివారిని బూతులు తిట్టడమే కాకుండా, చావ చితకగొట్టేవారు దొరలు.

రైతులు ముందు దొరల పొలాల్లో పనిచేసిన తర్వాతనే 'తమ' పొలాలకు వెళ్ళాల్సి వచ్చేది.

నిజాం సంస్థానం ఒక చీకటి రాజ్యం. గ్రామాల్లో పీడిత ప్రజలందరూ దొరలు, పటేలు, పట్వారీలకు, పై నుండి వచ్చే ఉద్యోగులకు రకరకాల వెట్టిచాకిరి చేయాలి. ఇది అన్ని కులాలకు వర్తిస్తుంది. హరిజనులు, చాకళ్ళు, మంగళ్ళు, కుమ్మర్లు, వర్తకులు (కోమట్లు) –అందరికీ వెట్టిచాకిరి తప్పదు. దొరల భూములు సాగుచేసి, విత్తనాలు వేసిన తరువాత సొంత భూమి సాగుచూసుకోవాలి. దీనికి తోడు రకరకాల పన్నులు– రోలు పన్ను, రోకటి పన్ను, పెండ్లికి పన్ను, సమర్తాడితే పన్ను, తీర్థమాడితే

పన్ను, చస్తే పన్ను మొదలైన అనేక చట్ట వ్యతిరేక పన్నులు వసూలు చేసేవారు. వీటికి తోడు జాగీర్దార్లు, దేశముఖ్‌లు, పెద్ద భూస్వాములు నజరానాలను గుంజేవారు. నాగు దోపిడీ, విపరీత వడ్డీల దోపిడీ ఉండేది,

ఒక దొరగారు తన అవసరాలకూ, భోగ విలాసాలకూ కావలసిన వస్తువుల కోసం అవసరమైన ధనాన్ని తన ఆస్తి నుంచి ఖర్చు చేయడానికి బదులుగా ప్రజల నుంచి వసూలు చేసేవాడు. తన ఇంట్లో పెళ్ళిళ్ళ వంటి శు భకార్యాలకు, చావుల్లాంటి అశుభ కార్యాలకు కావలసిన డబ్బు, ధాన్యం, ఇతర సామాన్లు ప్రజల నుంచి రావలసిందే. తాను నిర్మించే భవనాలకు కావలసిన డబ్బుతో పాటు రాయి, సున్నం మొదలైన సరుకు –సామగ్రి ప్రజల నుంచి గుంజేవారు. రైతులు తమ బళ్ళతో రాయి, ఇటుక, సున్నం తోలాలి. కూలీలు ఉచితంగానో, నామమాత్రపు కూలీలకో పనిచేయాలి. ఒక కారు కొన్నప్పుడు, లేదా మరొక విలువైన వస్తువు తెచ్చినప్పుడు ఇదే పరిస్థితి ఉండేది. అక్రమమైన డబ్బును ప్రజల నుండి వసూలు చేయడానికి, ప్రజలను అదుపులో పెట్టడానికి దొరలు కిరాయి మనుషులను పోషించేవారు. వారివారి తాహతును బట్టి ఒకరిద్దరి నుంచి వందమంది వరకు వీరి సంఖ్య ఉండేది. ప్రజలను కొల్లగొట్టి జీవించడానికి దొరలకు వీరు అండగా ఉండేవారు. దొరలపై భక్తి విశ్వాసాలను ప్రదర్శిస్తూ ప్రజల పాలిటి యమభటులై వ్యవహరించేవారు.

పేద రైతులు, కూలీలు పండించిన పంట ఇంటికి చేరిన రోజుల్లోనే రెండు పూటలా కడుపు నిండా తినేవారు. మిగతా రోజుల్లో అర్ధాకలితో బాధపడేవారు. గంజి కలిసిన మెతుకులు, గంజి లేనప్పుడు నీళ్ళలో తడుపుకున్న అన్నం తినేవారు. కారం కలుపుకొని పొడి అన్నం తినేవారు. కట్టుకోడానికి సరైన గుడ్డలు లేకుండా వ్యవసాయ కూలీల జీవితాలు మరింత దుర్భరంగా ఉండేవి. వారికి ఏ విధమైన స్వేచ్ఛ ఉండేది కాదు. చేతిపనులవారు. ఇతర వృత్తులవారు, హరిజన, గిరిజనులు–

ఒకరేమిటి ప్రజలందరూ దొరల ప్రత్యక్ష దోపిడికి గురవుతూ దినదినగండంగా జీవితాలను గడిపేవారు.

## సాంస్కృతిక వాతావరణం

ఆనాటి హైదరాబాద్ సంస్థానంలోని ప్రజల్లో 3 నుండి 5 శాతం వరకు మాత్రమే అక్షరాస్యులు ఉండేవారు. అక్షరాస్యతను పెంచడానికి నిజామ్ ప్రభుత్వం ఎటువంటి చొరవా తీసుకోలేదు.

మొత్తం రాష్ట్రంలోనే 5 ఇంటర్మీడియట్ కాలేజీలు, 1 డిగ్రీ కాలేజీ, 31 హైస్కూలులు, 105 మిడిల్ స్కూలులు, 4000 ప్రాథమిక పాఠశాలలుండేవి.

ప్రాథమిక పాఠశాలలు తప్ప మిగతా అన్ని విద్యాలయాల్లో ఉర్దూ మాధ్యమంలోనే చదువు చెప్పేవారు.

కొంత విద్యాధికులైన ప్రజలు కూడా భావదాస్యానికీ, భాషాదాస్యానికీ అలవాటు పడిపోయారు. ముస్లిం సంస్కృతితో ప్రభావితులై టర్కీటోపీలు, పైజమా–షేర్వానీ వేషభాషలతో తెలుగుతనానికీ, భారత జాతీయతకు దూరం కాసాగారు.

హిందూ, మహమ్మదీయుల పండుగలు రెండూ ఒకేసారి రావడమంటూ జరిగితే హిందువుల పండుగలను ప్రభుత్వం నిషేధించేది. మత స్వాతంత్ర్యమనే మాట వినబడేదే కాదు.

సంస్థానంలో అధిక సంఖ్యాకులుగా ఉన్న తెలుగు, మరాఠీ కన్నడ ప్రజల వేషభాషలు, మత విశ్వాసాలు అణచబడ్డాయి.

గస్తీ నిషాన్ తిర్పన్ అనే జీవో (నెం. 53) ప్రకారం ఏదైనా సమావేశం జరపడానికి నిజామ్ నవాబు అనుమతి అవసరమయ్యేది. పత్రికా స్వేచ్ఛ ఉండేది కాదు. 'గోల్కొండ' పత్రికను స్థాపించాలనుకున్నప్పుడు, అందులో 'ఆంధ్ర' అన్న పదాన్ని చేర్చడానికి ప్రభుత్వం అంగీకరించలేదు. తెలుగు పత్రిక నడపాలంటే క్యాబినెట్ అనుమతి కావలసి వచ్చేది. క్యాబినెట్ అంటే ప్రజాప్రతినిధులు కాదు, నిజాం ప్రభువు చేత, జాగీర్దార్ల చేత, ఫస్ట్ క్లాస్ ప్లీడర్ల చేత నియమితులైన ప్రతినిధులు. అంటే ప్రభుత్వం కొమ్ము కాచే విధేయులన్నమాట. ఇదీ ఆనాటి పరిస్థితి.

తెలంగాణ సంస్కృతిపై పెను చీకట్లు ఆవరించిన కాలమది. ప్రజల రాజకీయ–సాంఘిక–సాంస్కృతిక జీవితం అతి నికృష్టదశకు చేరుకున్నది. ప్రజలకు పౌరసత్వపు హక్కుల్లేవు. వాక్, సభా, పత్రికా స్వాతంత్ర్యాలను గురించి చెప్పక్కర్లేదు.

తెలుగు బోధనాభాషగా ఉన్న ఒకే ఒక పాఠశాలను ఆనాటి ఉస్మానియా విశ్వవిద్యాలయం గుర్తించ నిరాకరిస్తే, పూణేలోని కర్వే యూనివర్సిటికి వెళ్లి పరీక్షరాయాల్సి వచ్చేది. తెలుగు భాష పట్ల ఉదాసీనత వహించడమే కాదు 'తెలంగీ బెడంగీ' (ముక్కూమొగమూ లేని వికృత తెలుగు భాష) అంటూ అపహాస్యం చేసేవారు.

జాగీర్దార్లు కానీ, మఖ్తాదార్లు కానీ ప్రజల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పించేవారు కాదు. కొత్త చెరువులు నిర్మించడం కానీ, పాత చెరువులకు మరమ్మతులు చేయించడం కానీ జరిగేది కాదు. విద్య, వైద్య సదుపాయాల విషయం ఆలోచించవలసిన పనే లేదు. పన్నుల భారం మాత్రం జాగీరు ప్రజలను రోజురోజుకూ క్రుంగదీయసాగింది. ప్రజల్లో క్రమంగా అసహనానికి, ఆశాంతికీ, అలజడులకు, ఆందోళనలకు ఊపిరి పోసింది.

## హైదరాబాద్ సంస్థాన జన చైతన్యం

నిరంకుశ రాజరికం, దుర్భర దారిద్ర్యం, తీవ్రమైన అణచివేత, అమానుషమైన మత వివక్షల నడుమ దినదినగండగా జీవితాన్ని గడిపిన హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలు అసహాయులుగా మిగిలిపోలేదు, పాలకవర్గంపై నిరసన, అణచివేతలకు ప్రతిఘటన, దౌర్జన్యాలపై తిరుగుబాట్లను అనేక రూపాల్లో వ్యక్తం చేశారు. చిన్న చిన్న నిరసనలతో ప్రారంభమై సాయుధ సమరం ద్వారా పరిణమించిన ఈ మహోజ్వల ప్రజా పోరాట చైతన్యానికి ఊపిరులూదిన సంస్థలూ, ఉద్యమాలూ అనేకం, వాటి పాత్ర, అవి నిర్వహించిన కార్యక్రమాలూ నిత్య స్మరణీయాలు.

## సాంస్కృతిక పునరుజ్జీవనం

ఈ శతాబ్దారంభం నుండే తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. కీ.శే. రావిచెట్టు రంగారావు, కొమఱ్ఱాజు లక్ష్మణరావు, శ్రీ రాజా నాయని వేంకట రంగారావు గార్లు వారి మిత్ర బృందంతో కలిసి 1901లోనే సుల్తాన్‌బజార్లో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' స్థాపించారు. దీనికి గ్రంథాలను సమకూర్చడానికి 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి'ని ప్రారంభించారు.

వరంగల్లు జిల్లాలోని 'ఇనుగుర్తి' అనే గ్రామంలో కీ.శే. వద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవ రంగారావుగార్లు అనేక నవలలు, నాటకాలు, భాషా విషయిక గ్రంథాలు రాయడమే గాక, 'విజ్ఞాన ప్రచారణీ గ్రంథమాల'ను నెలకొల్పి సారస్వత సృజనకు దోహదం చేశారు. 'తెలుగు పత్రిక' అనే వారపత్రికను కూడా వెలువరించారు. అదే కాలంలో నల్లగొండలో కీ.శే. షబ్నవీసు వెంకట నరసింహారావు గారు 'నీలగిరి పత్రిక' పేరుతో ఒక వారపత్రికను, వీరేశలింగ కంఠాభరణ గ్రంథమాల'ను నెలకొల్పారు. వీరు ప్రచురించిన గ్రంథాలన్నింటికీ రెండణాలే వెల, నల్లగొండ జిల్లా సూర్యాపేటలో కీ.శే. పువ్వాడ వెంకటప్పయ్యగారు 'కృషీ ప్రచారిణీ గ్రంథమాల'ను నెలకొల్పారు. సికింద్రాబాద్‌లో వట్టికోట ఆళ్వారుస్వామిగారు 'దేశోద్ధారక గ్రంథమాల'ను స్థాపించి, అభ్యుదయకరమైన అనేక పుస్తకాలను వెలువరించడమే కాక, సంచి భుజాన వేసుకుని ఇంటింటికీ తిరిగి పుస్తకాలు అమ్మేవారు.

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు, కె.సి గుప్తా 'అణా గ్రంథమాల'ను నెలకొల్పి చాలా చిరుపొత్తాలను 'అణా'కే విక్రయించేవారు. వీరి ప్రచురణలపై ప్రభుత్వం కన్నెర్ర జేయడం, కోర్టుకు పోవడం కూడా జరిగింది.

సురవరం ప్రతాపరెడ్డి గారు స్థాపించి, చాలా కాలం పాటు సంపాదకత్వం వహించిన 'గోల్కొండ పత్రిక' ఖచ్చితమైన రాజకీయ దృక్పథంతో వెలువడడమే గాక, అనేక ప్రచురణలను వెలువరించింది. ప్రతాపరెడ్డిగారు సంకలనం చేసిన 'గోలకొండ కవుల సంచిక' ద్వారా ఎందరో అజ్ఞాత తెలంగాణ కవుల వివరాలు వెలుగుచూశాయి.

## ఆది హిందూ వలంటీర్ దళం

1906 నాటికే హైదరాబాద్ నగరంలో భాగ్యరెడ్డివర్మ నాయకత్వంలో ఆది హిందూ వలంటీర్ దళం పనిచేయసాగింది. ఈ దళంలో 35 మంది నిబద్ధ వలంటీర్లుండేవారు. హరిజనోద్ధరణ కోసం అవిశ్రాంతంగా కృషి చేయడంతో పాటు హరిజనులు సభలు, సమావేశాలు జరుపుకున్నప్పుడు ఈ దళ సభ్యులు వారికి సహకరిస్తూ ఉండేవారు. సవర్ణ హిందువులుగా పిలువబడుతున్న వారితో కలసిమెలసి పనిచేస్తూ, అస్పృశ్యతా నివారణ కోసం కృషి సలిపేవారు. హైదరాబాద్లో కలరా, ఇన్ఫ్లూయెంజా వంటి భయంకరమైన వ్యాధుల బారినపడి మరణించినవారిని వారి కుటుంబ సభ్యులు కూడా పట్టించుకోని విషమ పరిస్థితులలో ఈ దళ సభ్యులు దహన సంస్కారాలు జరిపేవారు.

## జగన్మిత్ర మండలి

అస్పృశ్య కుటుంబంలో పుట్టిన భాగయ్య ('భాగ్యరెడ్డివర్మ'గా తన పేరు మార్చుకున్నాడు) 'జగన్మిత్ర' సంస్థను నెలకొల్పి, విశ్వజనీనతను ప్రచారం చేశాడు. హరిజనులైన హరిదాసుల చేత, మాల జంగాల చేత హరికథలు చెప్పించేవాడు. 1911వ సంవత్సరంలోనే జగన్మిత్ర మండలి సాంస్కృతిక ప్రదర్శనల సందర్భంగా సంస్థానులు కులభేదాలు విస్మరించి సహపంక్తి భోజనాలు చేయడం భాగ్యరెడ్డి వర్మ సాధించిన అద్భుత విజయంగా భావింపవచ్చు.

## ఆది హిందూ మహాసభలు

1911లోనే 'ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్'ను నెలకొల్పి, కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన భాగ్యరెడ్డివర్మ 1921 నుండి 1924 వరకు ప్రతి ఏటా ఆది హిందూ మహాసభలు నిర్వహించాడు. 'హరిజన' పదం అప్పటికి తెలంగాణ ప్రాంతంలో వ్యాప్తిలోకి రాలేదు. ఆది హిందువులుగా, అది ఆంధ్రులుగా, ఆది భారతీయులుగా నిమ్న వర్గ ప్రజలు తమను తాము ప్రకటించుకోవాలని భాగ్యరెడ్డివర్మ ప్రచారం చేశాడు. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, మాడపాటి హనుమంతరావు గారు ఈ సభల నిర్వహణకు సహకరించేవారు.

## ఆర్యసమాజం

1892వ సంవత్సరంలో ఆర్యసమాజ స్థాపకులైన స్వామీ దయానంద సరస్వతి ప్రియశిష్యుడైన స్వామీ నిత్యానంద సరస్వతి హైదరాబాద్‌కు వచ్చి ధార్మిక ప్రసంగాలు చేశాడు. వాటి ప్రభావంతో హైదరాబాద్‌లో 'ఆర్య సమాజం' ఏర్పడింది. హైదరాబాద్‌లోని రెసిడెన్సీ బజార్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న ఈ సంస్థకు కమలా ప్రసాద్గారు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. హిందూ మతంలోని మూఢ నమ్మకాలను దూరం చేసి, ప్రచారం కావించడమే వీరి లక్ష్యం. స్వామీ దయానందుల వారి 'సత్యార్థ ప్రకాశిక' ఆర్య సామాజికులకు ప్రామాణిక గ్రంథం, ఇతర మతాలలోకి వెళ్ళిన హిందువులను శుద్ధి చేసి, హిందూమతంలోకి పునఃప్రవేశం కల్పించడం వీరి కార్యక్రమం.

## ఆంధ్రోద్యమ నేపథ్యం

మాడపాటి హనుమంతరావుగారి షష్టిపూర్తి సందర్భంగా ఆయన సన్నిహితులు ఆయనకు సమర్పించిన నిధితో 'ఆంధ్ర చంద్రికా గ్రంథమండలి'ని స్థాపించి, నిజాం రాష్ట్ర ఆంధ్రోద్యమానికిన వెన్ను తట్టిన అనేక గ్రంథాలను వెలువరించారు.

వీటితో పాటు 'ప్రభాత ప్రచురణ సమితి', 'వైదిక గ్రంథమండలి' వంటి ప్రచురణ సంస్థలు, 'ఆంధ్రమాత,' 'తెలుగు పత్రిక,' 'భాగ్యనగర పత్రిక,' 'తెలుగుతల్లి', 'ఆంధ్ర కేసరి', 'సందేశం', 'తెలంగాణ', 'మీజాన్', వంటి పత్రికలు తెలుగు ప్రజల చైతన్య స్థాయిని పెంచడానికీ, తెలుగు భాషా వికాసానికీ ఇతోధికంగా తోడ్పడ్డాయి.

ఇలా అనేక సంస్థలు, పత్రికలు తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవన వికాసాలకు పాటుపడ్డాయి. తద్వారా తెలంగాణాలో ఆంధ్రోద్యమ స్పృహకు శ్రీకారం చుట్టాయి.

మద్రాస్‌లో తమిళ భాషా ప్రాబల్యం, తమిళుల బాధ్యతారహిత వ్యాఖ్యానాలు ఏ విధంగా ఆంధ్రోద్యమానికి ఆజ్యం పోశాయో. అదేవిధంగా తెలంగాణలో ఉర్దూ, మరాఠీ భాషల ప్రాబల్యం, తెలుగేతరుల బాధ్యతారహిత వ్యాఖ్యానాలు ఇక్కడి ఆంధ్రోద్యమానికి దోహదం చేశాయి.

1921వ సంవత్సరం, నవంబర్ 11, 12 తేదీల్లో హైదరాబాద్ నగరంలో ప్రముఖ మహారాష్ట్ర సంఘ సేవకులు, ఎస్.ఎస్.డి.టి మహిళా విశ్వవిద్యాలయ సంస్థాపకులు మహర్షి కార్వే పండితుని అధ్యక్షతన 'నిజామ్ రాష్ట్ర సమాజ సంస్కార మహాసభలు' జరిగాయి. ఆయన అధ్యక్షోపన్యాసం చాలా వరకు మరాఠీలోనూ, కొంత ఇంగ్లీషులోనూ జరిగింది. మహాసభ కార్యకలాపాలన్నీ ఇంగ్లీషు, మరాఠీ,

ఉర్దూ భాషల్లోనే జరుగసాగాయి. ఇది ఆంధ్రులకు కొంత అసంతృప్తిని కలిగించింది. దానికి తోడు హైదరాబాద్ నగరంలో ప్రముఖ న్యాయవాది శ్రీ ఆలంపల్లి వెంకటరామారావుగారు ఒక తీర్మానంపై తెలుగులో ప్రసంగించడం మొదలు పెట్టగానే సభలో చప్పట్లు, అభ్యంతరాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా మహారాష్ట్రులు తెలుగులో వినడానికి ఇష్టపడక గొడవ ప్రారంభించడంతో ఆయన తన ఉపన్యాసాన్ని మధ్యలో ఆపి కూచోవలసి వచ్చింది. ఈ సంఘటన తెలుగువారిని మరింత నొప్పించింది. స్థానికంగా అధిక సంఖ్యలో ఉన్న తెలుగు ప్రజలు దీనిని అవమానంగా భావించారు. పర్యవసానంగా 'ఆనాటి రాత్రియే ఆంధ్రోద్యమము నారంభించు సంకల్పముతో ఆంధ్ర జన సంఘమమనది స్థాపించబడెను' పదకొండు మంది సభ్యులతో అప్పటికప్పుడు స్థాపితమైన ఈ సంఘంలో శ్రీయుతులు మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, ఆదిరాజు వీరభద్రరావు వంటి ప్రముఖులు ఉన్నారు. అతి తక్కువ కాలంలోనే ఈ సంస్థ సభ్యత్వం 100 దాటింది. ఆంధ్ర జన సంఘం ప్రథమ సమావేశం 14 ఫిబ్రవరి 1922 నాడు శ్రీ కొండా వెంకట రంగారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్ లో జరిగింది. ఈ సమావేశంలోనే సంస్థ పేరు 'నిజామ్ రాష్ట్ర ఆంధ్ర జన సంఘం'గా మారింది. దీని మొదటి కార్యదర్శిగా ఎన్నికైన మాడపాటి హనుమంత రావుగారు తెలంగాణ సాంస్కృతికోద్యమంలో ప్రముఖ పాత్రను నిర్వహించ సాగారు.

## ఉద్యమ ఆశయాలు – ఆచరణ

తెలంగాణా ప్రాంతంలోని ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చైతన్యాన్ని పదును పెట్టడం, స్థానిక ఆంధ్ర ప్రజల్లో పరస్పర సహకార భావాన్ని కల్పించి వారి అభివృద్ధికి పాటుపడడం, ఆంధ్రుల శ్రేయస్సు కోసం సంఘాలను, సంస్థలను స్థాపించడం, సభలను సమావేశాలను ఏర్పాటు చేయడం ఆంధ్ర జనసంఘ ఆశయాలుగా ప్రకటించారు.

'నిజామ్ రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి (స్త్రీ పురుష భేదం లేకుండా) పద్దెనిమిది సంవత్సరాలు దాటిన వయస్సుండి చదవడం, వ్రాయడం నేర్చుకుంటే ఈ సంస్థలో సభ్యులు కావచ్చు' అని స్పష్టపరిచారు.

తెలంగాణ ప్రాంతంలోని వివిధ జిల్లాల ఆంధ్ర సంఘాల కార్యక్రమాలను సమన్వయ పరచడానికి 1 ఏప్రిల్ 1923 నాడు హనుమకొండలో 'ఆంధ్ర జనకేంద్ర సంఘం' ఏర్పడింది. మాడపాటి హనుమంతరావు గారు ఈ కేంద్ర సంఘం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ కేంద్ర సంఘం 'వెట్టిచారికి', 'వర్తకసంఘం' వంటి కరపత్రాలను ప్రచురించింది.

తెలుగు పాఠశాలల్ని నెలకొల్పడం, తెలుగు గ్రంథాల్ని ప్రచురించడం, చారిత్రక పరిశోధనల్ని ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్ని ఈ కేంద్ర సంఘం ప్రారంభించింది.

చదువుకున్నవారిలో దేశాభిమానం, సోదర దేశీయుల క్షేమం కోసం పాటుపడాలనే భావం కలిగించడంలో 'ఆంధ్ర జన కేంద్రసంఘం' చురుకైన పాత్ర వహించింది. అదయినా ఒక పరిమితమైన సంస్థే కాబట్టి నిజామాంధ్రుల రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక వికాసానికి పాటుపడే ఒక విశాల వేదికను రూపొందించాలన్న ఆశయం ఇక్కడి విద్యావంతులైన పెద్దలకు కలిగింది. ప్రజల ఆశయాలకు, ఆదర్శాలకు, కోరికలకు దర్పణం పట్టగలిగే సంస్థగా దీన్ని తీర్చిదిద్దాలనే ఆశయంతో దాని పేరు 'నిజామ్ రాష్ట్ర ఆంధ్ర మహాసభ'గా మార్చాలనీ, 1930లో మొదటి మహాసభ జోగిపేటలో జరపాలనీ అప్పటి నాయకులు నిర్ణయించారు. అనేక ప్రభుత్వ ప్రతిబంధకాల మధ్య 'నిజామ్ రాష్ట్ర ప్రథమాంధ్ర మహాసభ' జోగిపేటలో 1930 మార్చి 3వ తేదీనాడు సురవరం ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతన 'ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకమ్ము' అనే ప్రబోధ గీతంతో ఆరంభమై జయప్రదంగా జరిగింది. దీనితో బాటు శ్రీమతి నడింపల్లి సుందరమ్మగారి అధ్యక్షతన మొదటి మహిళా సభ కూడా జరిగింది.

ఈ ప్రథమాంధ్ర మహాసభలో మొత్తం 32 తీర్మానాలను ఆమోదించారు. వాటిలో 1. వాక్ స్వాతంత్ర్యాన్ని అరికడుతున్న గస్తీ నిషాన్ (జీవో నెం 53)ను రద్దు చేయడం, 2. నిర్బంధ ప్రాథమిక విద్యావిధానం అమలు జరపడం, 3. ప్రభుత్వేతర పాఠశాలల స్థాపన విషయంలో ఉన్న నిర్బంధాలను తొలగించడం, 4. స్టేట్ లైబ్రరీలో ప్రాంతీయ భాషలు ఏర్పాటు చేయడం వంటి తీర్మానాలు ముఖ్యమైనవి.

ఈ ఆంధ్ర మహాసభలో కాంగ్రెస్‌వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు అందరూ కలిసి పనిచేశారు.

1930నాటికి కాంగ్రెస్ సత్యాగ్రహం ప్రజోద్యమ స్వరూపం దాల్చింది. సైమన్ కమీషన్కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనల ద్వారా ఉద్యమం ప్రజలను బాగా ఆకట్టుకుంది. దీని ప్రభావం ఆంధ్ర ప్రాంత ప్రజలపైన, నిజామాంధ్రులపైన కూడా పడింది.

కొన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ సత్యాగ్రహ ప్రభావంతో కాకపోయినా భూస్వాముల మీది కోపంతో రైతులు స్థానికంగా పోరాటాలను నిర్వహించి సంచలనాన్ని సృష్టించారు.

1932 – 33 మధ్య కాలంలో అమ్మపాలెం (ఆనాటి వరంగల్ జిల్లా) భూస్వామి కాళ్లూరి రాజేశ్వరరావుకూ, అక్కడి రైతులకూ మధ్య భూమి కోసం చాలా కాలం కోర్టులో కేసు నడిచింది. రైతులు కోర్టులో ఓడిపోయారు. డబ్బు నష్టపడి నిస్సహాయులైనారు. పట్టరాని కోపంతో భూస్వామిని చంపి ముక్కలు ముక్కలు చేశారు.

1930– 40 మధ్యకాలంలో తెలంగాణాలోని అనేక ప్రాంతాల్లో భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా, సన్నుల భారానికి నిరసనగా, వెట్టిచాకిరి నిర్మూలన దిశగా రైతులు తిరుగుబాట్లు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజావెల్లువ దానంతట అదే వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో 'ఆంధ్ర మహాసభ' పర్యవేక్షణలో నిబద్ధ నాయకత్వం నేతృత్వంలో క్రమబద్ధ పోరాట రూపాల ద్వారా సాగింది. కొన్ని ప్రాంతాల్లో కోర్టు కేసుల వంటి లీగల్ పద్ధతుల ద్వారా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో భూస్వాములను, వారి నమ్మకస్తులైన ఏజంట్లను హత్య చేయడం వంటి అతివాద రూపాల ద్వారా రైతాంగ పోరాటాలు జరిగాయి. ఇవి ప్రజాపోరాటాలు. వీనిలో ప్రజల పాత్ర విశిష్టమైనది.

అనేక మలుపులు తిరిగి, ఎంతో విశిష్టమైన చరిత్రను సృష్టించుకున్న తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రధానంగా నాలుగు దశలు కనపడు తున్నాయి.

### 1. ప్రారంభ దశ (1921–30)

దేశాభిమాన చైతన్యం, వివిధ సంఘాల నిర్మాణం, ప్రజలను సమీకరించడానికి జరిగిన కృషి ఈ దశలో ప్రధానమైంది.

### 2. భూస్వామ్య నిరసన (1930–46)

అనేక గ్రామాల్లో భూస్వామ్య పీడనకు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రజలు పోరాట శీలాన్ని ప్రదర్శించిన దశ ఇది.

### 3. నిజాం ప్రభుత్వంపై వ్యతిరేకత (1946 –48)

ఒకవైపు భూస్వాముల దౌర్జన్యాలను ప్రతిఘటిస్తూనే, మరోవైపు భూస్వాములకు రజాకారు గూండాలకు అండగా నిలిచిన రాజరిక నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఆంధ్ర మహాసభ' నాయకత్వాన ప్రజలు తిరుగుబాట్లను తీవ్రతరం చేశారు. శత్రువులెవరో తెలుసుకుని, సమరశీల సంఘటిత పోరాటాలు నిర్వహించారు.

### 4. సాయుధ పోరాటం (1948–51)

భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుగా ప్రారంభమైన పోరాటం పీడిత ప్రజల రాజ్యనిర్మాణాకాంక్షతో కొత్త మలుపు తిరిగింది. నిజాం రాజరిక పతనంతో ఆగక, యూనియన్ సైన్యాల పాశవిక దాడులకు ఎదురు నిలిచింది. గ్రామాలను విముక్తి

చేసింది. వెట్టిచాకిరిని రద్దుచేసింది. దున్నేవాడికి భూమిని పంచింది. పాలకవర్గాలపై ఎదురుతిరిగి పోరాడే సమర మార్గాన్ని చూపింది. తెలుగుజాతి ప్రతిఘటన చైతన్యాన్ని ప్రపంచానికి చాటింది.

సాహిత్యాన్ని, కళారూపాలను ప్రభావితం చేసే ప్రజల పోరాట సంస్కృతిని రూపొందించే పథనిర్దేశం చేసింది.

## తెలంగాణా విమోచనోద్యమకవులు

వీరోచిత తెలంగాణా విమోచనోద్యమాన్ని సృజించిన కవులను, రచయితలను మూడు విభాగాలుగా వర్గీకరింపవచ్చును.

**1. ప్రావాహికులు:** ఒక చేత్తో పెన్నూ మరో చేత్తో గన్నూ పట్టుకుని ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొంటూ ఉద్యమ అవసరాల కోసం రచనలు చేసినవారు. అజ్ఞాత, అరణ్య, కారాగారవాసాలు అనుభవించినవారు.

**2. ప్రవాహ ప్రభావితులు :** పోరాట ప్రాంతానికి దూరంగా ఉంటున్నప్పటికీ ఉద్యమ ఉదంతాలను విని, చదివి ప్రభావితులైనవారు. వీరిలో కొందరు పోరాట ప్రాంతాలను సందర్శించి, ప్రజల అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకొని సాహిత్య ప్రక్రియలుగా మలుచుకున్నవారు.

**3. ప్రవాహ ప్రేరితులు :** పత్రికల ద్వారా, ఇతర సాధనాల ద్వారా తెలంగాణ ప్రాంత పరిస్థితులను తెలుసుకొని, ప్రజల పోరాట పటిమను గ్రహించి ప్రేరణ పొంది రచనలు చేసినవారు.

## తెలంగాణ విమోచనోద్యమం– కాళోజీ కవిత్వం :

తెలంగాణా విమోచనోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని, జైలు శిక్షను అనుభవించి రాటుదేలిన ప్రజాకవి – కాళోజీ నారాయణరావు. గార్లపాటి రాఘవరెడ్డిగారి సాహచర్యం కాళోజీ కవితారచనకు తోడ్పడింది. తెలంగాణా సామాజిక, సాంస్కృతిక నేపథ్యం ఇతని కవిత్వానికి పదును తెచ్చింది.

1939వ సంవత్సరం – పెల్లుబుకుతున్న ప్రజా వెల్లువకు ఏదో ఒక మేరకు అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో నిజాం నిరంకుశ ప్రభుత్వం రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టింది. ఉర్దూలో ఈ ప్రక్రియను 'ఇస్లహాత్' అంటారు. దీని ప్రకారం హైదరాబాద్ సంస్థానంలో వృత్తుల ప్రాతిపదికన ఎన్నికలు జరిపి, మంత్రి వర్గాన్ని ఏర్పరచడం జరుగుతుంది.

అయితే ఈ మంత్రి వర్గం అసెంబ్లీకి బాధ్యత వహించదు. దాని ఏర్పాటు మొత్తం నిజాం నవాబు ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. బాధ్యతాయుత

ప్రభుత్వ స్థాపనకు తోడ్పడని ఈ సంస్కరణలను స్టేట్ కాంగ్రెస్ బహిష్కరించింది. మేధావులు, విమోచనోద్యమకారులు వీటిని తీవ్రంగా ఖండించారు. సహజంగానే ప్రజాపక్షపాతియైన కాళోజీ ఈ ఇస్లహాత్‌ను వ్యతిరేకిస్తూ...

**"ఎందులకు? ఎందులకు? ఇస్లహాత్ ఎందులకు?**
**అయ్యలు మెచ్చని మియ్యలు వొల్లని ఇస్లహాత్ ఎందులకు?**
**అన్యాయాలను దాచి పెట్టుటకు అట్టహాసమది ఎందులకు?**
**పల్లె పల్లెలో ప్రభుత్వ బలముతో ప్రచారమింతగ ఎందులకు?**
**దుష్టులు చేసే దౌర్జన్యాలకు దోహదమిచ్చే దెందులకు?**
**కుయ్యో మొర్రో యను బీదసాదలకు కర్రదెబ్బలవి ఎందులకు**
**కత్తులు దూసి వచ్చే వారితో మెత్తని మాటలు ఎందులకు?**
**రైతాంగం మెప్పులేని – రాజ్యాంగం బెందులకు?**
**పలుకరాని సభకునేగి విలపించుట ఎందులకు?**
**నేటుగాను రెండు కండ్ల– మేటి మాటలెందులకు?**
**'కాదు' అనుచు చాటుగాను కన్నుగీటుటెందులకు?**
**పలుకు పలుకునకు అనుజ్ఞ అయితే ప్రతినిధులగుట ఎందులకు?**
**ఆధిపత్యమియ్యలేని – ఆయిన్ అది ఎందులకు?**

అంటూ కేవలం అలంకార ప్రాయమైన మంత్రివర్గ ప్రాతినిధ్యంపై ప్రశ్నల వర్షం కురిపించారు. అంతటితో ఆగని కాళోజీ ఈ రాజ్యాంగ సంస్కరణల వల్ల ఎన్నికైన ప్రతినిధులను ఆక్షేపిస్తూ, అధిక్షేపిస్తూ కవితాగ్రహం ప్రకటించారు. ఎంగిలి విస్తరికన్నా హేయమైన పదవులను పొందినవారిని మందలించారు. పోటీ లేకుండా సీటు పొంది పొంగిపోవుటను హేళన చేశారు. మరోవైపు నిజాం నవాబు మంత్రివర్గంలో చేరవలసిందిగా ఆహ్వానం రాగా, తిరస్కరించి స్వాభిమానాన్ని ప్రకటించిన బూర్గుల రామకృష్ణారావు గారిని అభినందిస్తూ...

**"రాజరికము మోజులేక తేజరిల్లు నాయకుడా!**
**రాజనీతి కోవిదుడా– రామకృష్ణామాత్యా!**
**పుట్టెడు బుద్దులే కాదు గట్టి గుండె కలవాడవు**
**మహదాశయ మబ్బుదాక– మంత్రి పదవి అయినాసరే**
**కాలదన్నుమటె కాదు – కాలదన్న గల్గినావు"**

అంటూ తెలుగువారు తలెత్తి తిరుగునట్లు చేసిన త్యాగశీలతను ప్రశంసించారు.

1943 మే 26 నాడు హైదరాబాద్ ఆబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్లో జరిగిన దశమాంధ్ర మహాసభ సమావేశంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపనోత్సవ సందర్భంగా

**"మాతృదేశము మాటముచ్చట ముదముగూర్పదు మదికిననియెడి**
**పరమ నీచుడు ధరణినంతట గలయ వెదికిన గాననగునా?**
**నీరులేని ఎడారియైనను వానవరదల వసతియైనను**
**అగ్గి కొండల అవనియైనను- మాతృదేశము మాతృదేశమే"**

అంటూ మాతృదేశ భక్తి ప్రబోధాత్మకమైన గేయాన్ని రచించారు. లాఠీ దెబ్బలను, కఠిన శిక్షలను అనుభవిస్తున్నప్పటికీ మాతృదేశము స్వర్గతుల్య మైనదనీ, పరుల వశమున నరక కూపము కన్న హేయంగా కఠినతరంగా మారినది కాబట్టి మాతృదేశ విముక్తి కోసం పాటుపడాలనీ కాళోజీ సూచించారు.

మాతృదేశాన్నీ, మాతృభాషనూ అమితంగా అభిమానించిన కాళోజీ, నిజాం రాష్ట్రంలోని తెలుగు ప్రజల్లో కొందరు తెలుగు భాష పట్ల చూపే నిరాదరణకు స్పందించి...

**"ఏ భాషరా నీది ఏమి వేషమురా -**
**ఈ భాష ఈ వేషమెవరికోసమురా**
**ఆంగ్లమందున మాటలాడగలుగగనే -**
**ఇంతగా కుల్కెదవు ఎందుకోసమురా?**
**అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు-**
**సకిలించు ఆంధ్రుడా! చావవెందుకురా!!"**

అని సూటిగానే హెచ్చరించారు. భావదాస్యాన్ని ఎండగట్టారు. స్వాభిమానాన్ని తట్టిలేపారు.

**"అన్నపురాసులు ఒక చోట - ఆకలి మంటలు ఒక చోట**
**హంస తూలికలొకచోట అలసివ దేహాలొకచోట**
**సంపదలన్నీ ఒక చోట - గంపెడు బలగం బొకచోట"** గా

ఉన్న ఆర్థిక వ్యత్యాసాలను కవి ఎత్తి చూపారు. అవనిపై జరిగేటి అవకతవకలు జూచి ఆవేదన చెందారు.

ఒక వైపు ప్రగతిశీల ప్రజాకవులు దుర్మార్గపు రాజరికాన్ని నిలదీస్తూ అరణ్య, అజ్ఞాత, కారాగార వాసాలు గడుపుతుంటే, మరోవైపు రాజరికానికి అమ్ముడుపోయిన ముగ్గురు ఆనాటి సాహితీవేత్తలను 'రాకానీ' అన్న సంకేతనామంతో ప్రజాస్వామ్యవాదులు గర్జించారు. వీరిలో ఒకరు రాయప్రోలు సుబ్బారావు, రెండవ వారు కాసింఖాన్, మూడవవారు కురుగంటి సీతారామాచార్యులు.

1943వ సంవత్సరం – వరంగల్లులోని 'శబ్దానుశాసన గ్రంథాలయ' వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన కవి సమ్మేళనానికి రాయప్రోలు అధ్యక్షులు. తెలంగాణా ప్రజల పోరాటానికి సంఘీభావం ప్రకటించని ఆనాటి ఉస్మానియా విశ్వ విద్యాలయ తెలుగు శాఖాధిపతి రాయప్రోలును అధిక్షేపిస్తూ, ఆనాటి కవి సమ్మేళనంలో కాళోజీ చదివిన కవితలో

**"లేమావి చిగురులను లెస్సగా మేసేవు ఋతురాజువచ్చెనని అతి**
**సంభ్రమముతోడ**
**మావి కొమ్మల మీద మైమరిచి పాడేవు**
**తిన్న తిండెవ్వారిదే కోకిలా! పాడు పాటెవ్వారిదే?"**

అని సూటిగానే నిలదీశారు. ఊరూ పేరూలేని పిచ్చుకను దయదలచి చేరదీస్తే మావిగున్నల మాట మాటవరుసకైనా తలవని కృతఘ్నతను ప్రశ్నించారు.

1944లో వరంగల్లులో ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవం జరిగింది. రజాకార్లు ఈ ఉత్సవాలను భగ్నం చేయాలని, వరంగల్ కోటలోని ఏర్పాట్లనన్నింటినీ ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఖుషీ మహల్ లో కవి సమ్మేళనం జరపడానికి అప్పటి పురావస్తు శాఖవారు అనుమతిని నిరాకరించడం వల్ల, కాలి కూలిన పందిళ్ళలోనే కవి సమ్మేళనం నిర్వహించారు. దీనికి ముసివట్ల పట్టాభిరామారావు అధ్యక్షత వహించగా సురవరం ప్రతాపరెడ్డి, దాశరథి, గార్లపాటి రాఘవ రెడ్డి మొదలైన ప్రముఖులు హాజరయ్యారు. దాదాపు అరవై మంది కవులు కావ్యగానం చేశారు.

**"కూలిపోయిన కోటగోడలను జూపి**
**శిథిలమైన గుళ్ళ శిల్పముల జూపి**

**పగిలిపోయిన దైవ ప్రతిమలను జూపి–**
**చినిగి పోయిన పాత చిత్రముల జూపి**
**మాసిపోయిన రాజశాసనము జూపి –**
**పురుగు పుట్టిన తాటి పొత్తముల జూపి**
**తుప్పు పట్టిన కత్తి తునకలను జూపి**
**పూర్వ గాథలు జెప్పి పొంగేటి”**

మనస్తత్వాలను కాళోజీ విమర్శించారు. ప్రస్తుత దీనస్థితిని చూసి ప్రతిఘటించాల్సిందిగా ప్రబోధించారు.

1946 – వరంగల్లు కోటలో జరుపతలపెట్టిన జాతీయ పతాకావిష్కర ణోత్సవాన్ని భగ్నం చేయడానికి రజాకార్లు బీభత్సం సృష్టించారు. వీరి అరాచకాన్ని ఎదిరించి వీరోచితంగా పోరాడిన మొగిలయ్యను దారుణంగా హతమార్చారు. అక్కడే శబ్దానుశాసన గ్రంథాలయ వేదికపై నిలుచున్న పసిబాలుని రజాకార్లు పొడిచి, అతని ప్రేగులను కత్తులకు తగిలించి ఊరేగారు. తర్వాత కొద్ది రోజుల్లోనే డా॥ నారాయణ రెడ్డి అనే వైద్యుడ్ని కూడా పాశవికంగా హత్య చేశారు. ఈ అమానుష చర్యలను నిరసించిన కాళోజీ...

**“న్యాయమును పాటింప నొల్లని ఆధిపత్యము అండయుండిన**
**హత్య, దోపిడీ, మానభంగాల్ – నిత్య కర్మల జేరినట్లే –**
**రక్షణకు ఏర్పడ్డ బలగము – రక్కసుల పక్షంబు జేరిన**
**రాక్షసుల ఇష్టానుసారము – రాజ్యమును నడిపించినట్లే**
**పట్టపగలే పట్టణంలో పట్టి పౌరుల కొట్టి చంపిన**
**దుష్ట కూటమితో ప్రభుత్వం దొంగ బేరము జేసినట్లే ”**
కొనసాగుతున్న దుష్ట ప్రభుత్వ దుర్నీతిపై ప్రజాగ్రహాన్ని ప్రకటించారు.

కాళోజీ ధర్మాగ్రహంపై నిజాం ప్రభుత్వం కన్నెర్రజేసింది. 1947వ సంవత్సరంలో మూడు నెలలపాటు కాళోజీకి వరంగల్ నగర బహిష్కార శిక్షను ప్రభుత్వం విధించింది. శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఈ ప్రజాకని వరంగల్లుకు తిరిగి వచ్చినప్పుడు...

**"స్టేటు కాంగ్రెసు లక్ష్య సిద్ధికై మనకు –**
**మొగలయ్య చూపిన మూల్యమే పథము**
**శాంతి దూతలమనుచు ఛాలెంజ్ చేయ –**
**సహచరుల అన్యుల సమ్మతము చేత**
**జయము మాకూ చావు చవట సాములకు**
**నిందమోపిన వాడే నిందితుడు కాగా –**
**మా వూరికే మేము మరలి వచ్చితిమి**
అని ఆనందం వ్యక్తం చేశారు.

కాళోజీ కవిత్వానికి పర్యాయ పదంగా పేర్కొన దగిన గీతం....
**"నల్లగొండలో నాజీ వృత్తుల నగ్న నృత్యమింకెన్నాళ్లు?**
**పోలీసు అండను దౌర్జన్యాలు– పోషణ బొందే దెన్నాళ్లు?**
**దమన నీతితో దౌర్జన్యాలకు దాగిలిమూతలు ఎన్నాళ్లు?**
**కంచెయె చేనును మేయుచుండగా కాంచకుండుటింకెన్నాళ్లు?**
**దొంగలు దొంగలు ఊళ్లు పంచుకుని దొరలై వెలిగే దెన్నాళ్లు?**
**హింసను పాపమనెంచు దేశమున హిట్లరత్వమింకెన్నాళ్లు?"**

అని ప్రశ్నించిన కాళోజీ...

**"ప్రజా శక్తికి పరీక్ష సమయము– ప్రతీక్ష మనకింకెన్నాళ్లు?"**

అనడంలోనే ప్రతిఘటన పోరాటాలకు సమయం ఆసన్నమైందని ధ్వనింపచేశారు. అలాగే 1946వ సంవత్సరంలో నిజాం ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించినప్పుడు ...

**"ప్రజా సంస్థపై పగ సాధించిన ఫలితము తప్పక బయటపడున్**
**ఎక్కుచు నీల్గే నిరంకుశత్వము నిల్వలేక నేలను గూలున్**
**బేజారైన బీదలవోపిక – పెద్దల పై పిడుగయిరాలున్**
**'అయ్య! బానిస'ను అనిన పౌరుడే–అయ్య గొంతుక నట్టే అదుమున్"**

అనే ప్రజా తీర్పును క్రాంతదర్శిగా ప్రకటించారు.

నిజాం సైనికులు, రజాకార్లు కలిసి జనగామ తాలూకాలోని మాచిరెడ్డిపల్లె. ఆకునూరు గ్రామాలపైబడి స్త్రీలపై అత్యాచారాలు జరిపారు. ఈ దుశ్చర్యను నిరసించిన కాళోజీ ...

**"బాధ్యతలేని ప్రభుత్వ భటులు పెట్టే బాధలు చాలింక**
**బాధ్యత గల పరిపాలనలేక బ్రతికిన బ్రతుకులు చాలింక**
**హద్దుమీరి అధికార వర్గము ఆడిన ఆటలు చాలింక**
**రాజు పేరిట అరాజకమునకు జరిగిన పూజలు చాలింక**
**రక్కసి తనముకు పిశాచవృత్తికి దొరికిన రక్షణ చాలింక**
**మాచిరెడ్డిలో ఆకునూరులో దోచిన మానము చాలింక**
**రక్షణకై ఏర్పడ్డ బలగమే చేసే భక్షణ చాలింక"**

అంటూ ఈ దుర్మార్గాలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమయిందనీ, అధికార వర్గము ఆడే ఆటలు ఇక సాగడానికి వీలులేదనీ హెచ్చరించారు. ఈ గేయం అప్పటి 'తెలుగు స్వతంత్ర'లో ప్రచురించబడింది.

రజాకార్ల హత్యాకాండకు పరాకాష్ఠ జనగాం తాలూకాలోని బైరాన్‌పల్లి గ్రామ ప్రజలపై జరిగిన మూకుమ్మడి దాడి, స్త్రీలపై అత్యాచారాలు, పురుషులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపడం వంటి ఘటనలతో సంస్థానమంతా అట్టుడికిపోయింది. గుల్బర్గా జైల్లో నిర్బంధంలో వున్న ప్రజాకవి కాళోజీ ఈ వార్తలను చదివి ఆగ్రహోదగ్రులయ్యారు.

**"మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన**
**మన పిల్లలను చంపి మనల బంధించిన**
**మానవాధములను మండలాధీశులను**
**మరచి పోకుండగ గురుతుంచుకోవాలె**
**కసి ఆరిపోకుండ బుసకొట్టు చుండాలె**
**కాలంబు రాగానే కాటేసి తీరాలె**
**తిట్టిన నాల్కలను చేపట్టి కొయ్యాలె**
**కొంగు లాగిన వ్రేళ్ల కొలిమిలో పెట్టాలె**
**కన్నుగీటిన కళ్ల కారాలు చల్లాలె**

**తన్నిన కాళ్లను 'డాకలి'గ వాడాలె**
**కండ కండగ కోసి కాకులకు వెయ్యాలె**
**కాలంబు రాగానే కాటేసి తీరాలె"**

అనే కసిగీతాన్ని రచించారు. సత్యం, అహింస, దయ, ధర్మం, క్షమ అన్న పదాలను కట్టిపెట్టి చాణక్యనీతిని ఆచరణలో పెట్టాలని ఆదేశించారు.

**"సాగిపోవుటే బ్రతుకు – ఆగిపోవుటే చావు**
**సాగి పోదలచిన – ఆగరాదిచటెపుడు**
**ఆగిపోయిన – ముందు సాగనేలేవెపుడు**
**వేచి యుండిన – పోను నోచుకోనేలేవు**
**తొలగి త్రోవెవడిచ్చు – త్రోసుకొని పోవలయు**
**బ్రతుకు పోరాటము – పడకు ఆరాటము"**

అంటూ తెలుగు ప్రజలను తల ఎత్తి నడవమన్నారు. ఆగకుండా సాగిపొమ్మని ప్రబోధించారు.

కాళోజీ మాటలను కత్తులుగా, కొడవళ్లుగా మలచినవారు. పాటలను ఈటెలుగా ప్రయోగించినవారు. కవితా పంక్తులను సూక్తులుగా, సామెతలుగా, నుడులుగా, నానుడులుగా వాడుకునే వెసులుబాటు కల్పించినవారు. హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలకు పెద్ద దిక్కుగా నిలిచినవారు. నిరంతరం పోరాటాలతో త్రికరణ శుద్ధిగా మమేకమైన పరిపూర్ణ మానవుడు కాళోజీ.

**"ఉదయం కానే కాదనుకోవడం నిరాశ**
**ఉదయించి అట్లానే ఉంటుందనుకోవడం దురాశ**
**ఈ చీకటి ఉండదు – సూర్యుడు తప్పక ఉదయిస్తాడు"**

అనే చారిత్రక ఆశావాదాన్ని తన జీవితానికీ, వ్యక్తిత్వానికీ, కవిత్వానికీ అంతర్లయగా మలుచుకున్న మహాకవి కాళోజీ....

**“అతిథివోలె ఉండి ఉండి అవని విడిచి వెళ్లుతాను**
**పల్లె పట్టణంబులనక – పల్లేరై తిరిగినాను**
**కంటకాల మధ్య నేను కాలినడక నడిచినాను**
**ఈగవోలె దోమవోలె వాగుచు తిరుగాడినాను**
**అతిథివోలె ఉండి ఉండి అవని విడిచి వెళ్లుతాను”**

అన్న తెలుగు ప్రజల హృదయం, తెలంగాణా గళగర్జన, మానవతా మహాశిఖరం, నిత్య చైతన్య దీప్తి ఆయన. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ మరణించినాడన్న వార్త వినగానే... **‘పుటుక నీది – చావు నీది, బతుకంతా దేశానిది’** అన్న కవితాపంక్తులు సరిగ్గా కాళోజీకి వర్తిస్తాయి. కాళోజీ జీవితం, కవిత్వం నేటితరానికి స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయం.

# కాళన్న యాది

**బ**తికినంతకాలం
తనమాట మరిసి మనకోసం రంధి వడిండు
నలుగురి కోసం మాట్లాడిండు
జనం కోసం పోట్లాడిండు

మనకు ఆపదొస్తే తాను కరిగి కన్నీరయ్యిండు
మనకు కోపమొస్తే తానెత్తిన పిడికిలయ్యిండు
ఎక్కడ అన్యాయం జరిగినా
దిల్‌దార్‌గా ఎదురుదిరిగిండు
పల్లెలు పట్నాలనకా పల్లేరోలె దిరిగిండు

ప్రజల కోసం హక్కులడిగిండు
అధికారాలడిగిండు
మన గొడవలన్నీ తన గొడవగా జెప్పిండు
మన గోసలన్నీ తన గోసగా పలికిండు
మన యాసకు కైగట్టి నిలబెట్టిండు

అటోమాట ఇటోమాట లేకుండా
జనం మాటకు మాటయ్యిండు
జనం పాటకు పాటయ్యిండు
జనం బాట సక్కంగుంటే ఖుషయ్యిండు
బాట దప్పినప్పుడల్లా బోరున ఏడ్సిండు
సర్దుకొని వీపు సరిసి సరిదిద్దిండు

అనుభవం కొద్దీ అంటున్న గీ మాటన్నడు
ఇనకుంటే ఇసుక్కున్నడు
ఇంటే సంతోషపడ్డడు
కోపమొస్తే తిట్టి జెప్పిండు
బుద్ధి జెప్పే కాడ జర గుద్ది జెప్పిండు

లోపలొకటి బయటొకటి
చెప్పుడొకటి చేసుడొకటి తెల్వనోడు

ఎసోంటి ములాజాల్లేవు
మొహమాటాల్లేవు
మెహర్బానీల్లేవు మెరమెచ్చుల్లేవు
ఏమనుకున్నడో గదే జెప్పిండు
ఏం జెప్పిండో గదే జేసిండు
అందుకే గదా మనకింత ఇష్టమయ్యిండు

**కా**లంతో కలిసి నడిసిండు
ఒక్కోసారి కాలాన్ని తన వెంట నడిపిండు
**లో**కాన్ని లోతుగా సమజ్ జేస్కున్నడు
లోక జ్ఞానాన్ని మన కళ్ళకిచ్చి పోయిండు
**జీ**వితాన్ని వడబోసిండు ఇడమర్సి జెప్పిండు

కాళన్న మాటంటే మనమే
కాళన్న బాటెంటా జనమే
అసలు కాళన్నంటే మనకో పెద్దన్న పెద్దదిక్కు

కాళన్న నిండైన జీవితం ఒక విలువైన పుస్తకం
కాళన్న నిఖార్సయిన వ్యక్తిత్వం
మనకు చూపుడు వేలు
కాళన్న యాది మనకు మనాది
కాళన్న కైత మన తరానికి చేయూత

# డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ రేఖాచిత్రం



డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ హైదరాబాద్ పాతబస్తీలో 1954, ఆగస్టు 16వ తేదీన దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ (తెలుగు) ఎం.ఎ (ఇంగ్లీష్) పూర్తి చేశారు. అబ్బూరి రామకృష్ణారావు రచనలపై పరిశోధించి ఎం.ఫిల్. పట్టా పొందారు. 'తెలుగులో ఉద్యమగీతాలు' అనే అంశంపై పరిశోధించి పిహెచ్.డి. సాధించారు. 'ఆధునిక తెలుగు సాహిత్య ధోరణులు'పై సిద్ధాంత గ్రంథాన్ని మద్రాస్ విశ్వవిద్యాలయానికి సమర్పించి, డి.లిట్. పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యక్షులుగా, ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్, ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులుగా పనిచేసి 2014లో పదవీ విరమణ చేశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యులుగా గతంలో ఒక పర్యాయం ఉన్నారు. ప్రస్తుతం మరోమారు జనరల్ కౌన్సిల్ సభ్యులుగా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాసంఘం పదకోశ నిర్మాణ కమిటీ సభ్యులుగా పనిచేశారు. 2007లో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవెలప్మెంట్ కార్పోరేషన్ వారి నంది అవార్డు కమిటీ సభ్యులుగా ఉన్నారు. 2013లో విశ్వవిద్యాలయాలలో ప్రజాకవి కాళోజీ శతజయంతి ఉత్సవాలు నిర్వహించే కమిటీకి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం 2017లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహక కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. పాఠశాల స్థాయిలో తప్పనిసరి తెలుగు అమలు చేయడానికి విధి విధానాలను రూపొందించే కమిటీకి చైర్మన్ గానూ, తప్పనిసరి తెలుగు అమలు పర్యవేక్షక కమిటీకి చైర్మన్‌గానూ వ్యవహరించారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం బహూకరించే ఉద్యమకవి దాశరథి పురస్కార ఎంపిక కమిటీలోనూ, ప్రజాకవి కాళోజీ పురస్కార ఎంపిక కమిటీలోనూ పలుమార్లు సభ్యుడిగా ఉన్నారు. ఒక వ్యక్తిగా, వక్తగా, అధ్యాపకుడిగా, సాహితీవేత్తగా వీరు సాగించిన ప్రయాణాన్ని గురువులు, సహచరులు, శిష్యులు విశ్లేషించిన గ్రంథం "ఆత్మీయం' డాక్టర్ కందిమళ్ళ భారతి సంపాదకత్వంలో రూపొందింది.

1969 నుండి రచనా వ్యాసంగంలో ఉన్న ఎస్వీ ఇప్పటివరకు సరిగమలు (1978), జీవజ్వాల (1985), యుద్ధం జరుగుతూనే ఉంది (1992), జీవితం ఒక ఉద్యమం (2005), ఉద్యమం ఉద్యమమే (2018), కవితా సంపుటులు, జీవన్ ఏక్ సంఘర్ష్ (2013), Life is a Movement (2017) సంపుటులతో పాటు, ఇరవై ఎనిమిది సాహిత్య గ్రంథాలు ప్రచురించారు. మరో ముప్పై నాలుగు పుస్తకాలకు సంపాదక బాధ్యతలు వహించారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పదో ఉపకులపతిగా బాధ్యతలు నిర్వహించారు.

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

## డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

